# సంసారపు గొడవలు

'ఏమండి సుబ్బమ్మగారు ఏం జేస్తున్నారు?' అంటూ ప్రవేశించింది రామమ్మ.

'రండి రండి. బొత్తుగా తమ దర్శనాలే కరువయ్యాయ' అంటూ చాప పరిచింది సుబ్బమ్మ.

'మా అక్క, బావ, పిల్లలు వచ్చారు. ఈ వారం రోజులు వాళ్ళతో సరి. క్షణం తీరిక లేదంటె నమ్మండి సుబ్బమ్మగారు.'

'అంత తీరిక లేని పని యేం జేస్తున్నావమ్మా.'

'పొద్దున్నె యే దోసో, వుప్మావో, యిడ్లీయో చేయాలి. వట్టి కాఫీ అలవాటు లేదట వారికి. దానితో యే యేడున్నరో, యెనిమిదో అవుతుంది. సరే మామూలు వంట వున్నదేగా. మళ్ళీ మధ్యాహ్నం కాఫీ, ఫలహారము. సాయంత్రానికి వంట. ఇక తీరుబడి యేముంది చెప్పండి?'

'నిజమే ఈ నెగవ కాఫీ వల్ల పని తెములదు. అయినా యేమున్నా ఆరోగ్యమా? డబ్బు దండుగ. పని చెరుపు తప్ప'

'సరే కాని మన కోడలు కమల యేది? ఏం జేస్తున్నదండి?'

'ఆ రాణిగారి కేమిలెండి. ఏం జేసినా చెల్లుబడే. ఆమె ఆడిందే ఆట, పాడిందే పాట. అల్లా సాగుతున్నయి ఆమె రోజులు'

'అదేమిటి? కొత్తగా మాట్లాడుతున్నారే యీ రోజు'

'ఆ ఇంకెందుకండి రామమ్మ గారు! ఇన్నాళ్లు యెల్లాగో వోపిక పట్టుకుని సరిపెట్టుకపోతున్నాను యెందుకు నలుగురిలో నగుబాటని. ఈ సంసారముతో వేగ లేను యింక. అబ్బ చస్తున్నా దాంతో. చూడండి రామమ్మగారు! 60 యేండ్ల ముండను ఆరుగంటలకు లేవాలీ? పదహారేళ్ళ పడుచు పదిగంటలకు లేవాలీ? దానమ్మ కడుపుకాల! రోజూ యింతే. యిల్లా అయితే సంసారము యెల్లా జేస్తారు?'

'ఏదో చిన్నతనము. పోనీయండి'

'చిన్నతనము చితకతనము. మనం చిన్నతనములో ఇల్లానే చేశామా? తొలికోడి కూసినప్పుడు లేస్తే పన్నెండుగంటలవరకు పనే నాయె మళ్లీ రెండింటికి మొదలెట్టితే రాత్రి పదకొండు దాకా పనే వుండె. మనము ఇల్లాగే పదిగంటలకు లేచామా?'

'నిజమే లెండి. మనమాదిరి వీళ్ళేం జేస్తారు, కాస్త చీపురు పట్టుకొని వూడిస్తె చెయ్యంతా కందిపోతుందని భయపడే వాళ్లు. అయినా అందరూ అల్లా వుంటారా? వంకమ్మగారి కోడలు రత్తమ్మ; పుల్లమ్మగారి కోడలు నాగమ్మ మన కమల...'

★ డి. వి. యస్. రావు ★

'అఘోరించినట్లే వుంది. అలా అయితే ఇంకేమి? నిక్షేపంలా అందరిలాగు నేనూ వుండేదాన్నే! దాని దుంపతెగ! ఒక్క పని చేతకాదు, యే పనన్నా మొదలెట్టితే అఘోరించినట్లె వుంటుంది. చూడండి మొన్నమటుకు మొన్న తులిశమ్మకు అర్ఘ్యమిస్తున్నానండి. అన్నం తిని కంచము కడిగేది కాస్త దూరము పోతే దాని కాళ్లే మరిగిపోతాయి? ఆ నీళ్లు చింది నా మీద పడె దీని దుంపతెగ! దీనికి ఆచారము లేదు యేమీ లేదండి. సరేమళ్లా చచ్చినట్లు స్నానం చేసి తడిబట్ట కట్టుకొని అన్నం తిన్నానండి 60 యేండ్ల ముండను ఈ చలిరోజుల్లో. మావాడు లేదండీ! వాడు బెల్లంకొట్టిన రాయిల అల్లా నిలబడకపోతే దానిమీద నోరుచేసుకొంటె మరల ఇల్లాంటి పనులు చేస్తుందీ? మీరే చెప్పండి రామమ్మగారు.'

'తప్పు చేసినప్పుడు కోప్పడాల్సిన మాటేలెండి.'

'అయ్యో తీగ అన్నారు. ఏదో చెపుతారె సామెత! వాడి భయమేవుంటె నాకీ ఖర్మ యెందుకు? అది ఇల్లా రెచ్చిపోతుందా? కుక్కిన పేనులా వుండదూ? నిన్న పక్కింటి రత్తమ్మగారు పేరంటానికి రమ్మంటె పోయింది. కాస్త ఆలస్యము అయిందే అనుకోండి. నే చెప్పాగా 'అరే నీభార్య పేరంటానికి వెళ్లిందిరా' అని. అంతవరకు వకచోట కూర్చోగూడదూ కాలుకాలిన పిల్లిమాదిరి అటూ ఇటూ తిరక్కపోతే? అది వచ్చిందో లేదో చిన్నపిల్లవానిమల్లె వెంటబడి దానివళ్లో పెసలు గబగబా తింటుండె. అది పకపకా నవ్వుతుండె! ఇంక వాడి భయమేముంటుంది? దాన్ని నెత్తికెక్కించుకొంటున్నాడు. ఆడదానికి అంత అలుసు ఇస్తే ముందు ముందు అది వాడిమాట యేమి వింటుంది? ఆ సంసార మేమి బాగుపడుతుంది?"

ఈ కాలపు కుర్రవాళ్లలో చాలామంది ఇంతేనండి. పోయిన నెల్లో మా కోడలు పుట్టింటికిపోతే, అది పోయిన రెండో రోజునుండె సాగించాడు 'అమ్మా అది లేకపోతె యేం తోచటల్లేదే' అని. వాణ్ణి చూస్తుంటే మన్నుతిన్న పాము జ్ఞాపకం వచ్చిందనుకోండి- ఆ మందగొడితనానికి ఇంక యేం చెప్పమంటారు సుబ్బమ్మగారూ."

"అబ్బ బాబూ! ఈ రాక్షసికొంపలో నే వేగలేనమ్మా? మరే దారైనా చూచుకొంటేనే బాగుండుననిపిస్తోంది."

(39-వ పేజీ చూడండి)

శతమూలికాదిలేహ్యము

లోహాభ్రకసింధూరముతో సహా సేవించిన సమస్తసుఖవ్యాధులు, ఎఱుపు తెలుపు మచ్చలు, బగ్గలు నపుంసకత్వము నివారించి వీర్యవృద్ధి, బలము, నరముల పటుత్వము కలుగజేయును స్త్రీలబుతుశూలలు, కుసుమరోగములు, నష్టసంతానము నివారించి మంచిసంతానము కలుగజేయును. 40 దినములకు మందు రు 18

శ్రీ భుజంగరాజ వైద్యశాల

తాళ్ళరేవు, తూర్పు గోదావరి జిల్లా.

## పాటలునేర్పిన పెళ్ళాం

(25-వ పేజీ తరువాయి)

వచ్చింది. నిలదీసి అడిగాను ; "నీకీ డబ్బు ఎలా వచ్చిందో చెప్పమని."

"ఆడదానికంటె ఎక్కువ భయమైతే ఎట్లాగండీ! బొంగురు గొంతుక పెట్టి తాళంచెవు లిమ్మని గద్దిస్తే, తాళాలు యిచ్చెయ్యటమేనా!"

"ఏమిటీ, తాళాలు యిమ్మన్నది ఆ దొంగకాదూ ?"

"ఏబ్బే! నేనేనండీ. మీ కెంత ధైర్యం వుందో చూద్దామని గొంతు మార్చి నేనే గద్దించాను."

"అయితే మరి, దొంగ ఏమైనట్లు?"

"ఏమైనాడు ? మీరూ నేనూ కదులుతూ వుండటంచూసి వుడాయించాడు. మీ రింత పిరికివాళ్లని తెలిస్తే లోపలికే వెంచేసేవాడు."

"చాల్లే నీవేళాకోళం." అంటూ అక్కడనుంచీ లేచి యివతలకు ఒచ్చేశాను. ★

## సంసారపు గొడవలు

(21-వ పేజీ తరువాయి)

"పెద్దవారము మనమే అల్లా అంటె సంసారము ఎలా జరగాలో మీరే ఆలోచించండి. కొత్తపిల్ల. మనమే నెమ్మదిగా చెప్పి చేయించుకోవాలిగాని."

"అల్లా అయితే అనుకోవాల్సిన పనేముంది? నే చెప్పినా చేస్తుందా? దాని యిష్టమైతే తప్ప! మొన్న భాగవతము వినాలని బుద్ధిపుట్టింది. కాని పాడు కండ్లకు మసక లొకటి వచ్చిపడినై. దాన్ని పిలిచి ఏమే కమలా భాగవతము కొద్దిగా చదువుతావా అంటే యేమందో చూచారూ! భాగవతమెందుకూ బాపిరాజుగారు రచించిన హిమబిందు చదువుతున్నా వినండి అని చెప్పింది. వినాశకాలే విపరీత బుద్ధి అని చూచారూ దానిపోకడలూ బుద్ధులూ అదీనీ. నా యీడుకుతోడు నేను నవలలు వినాలట చూడండి రామమ్మగారు! ఏమన్నా భయముంటేనా యిట్లా చెప్పటం? నాతోనా పరాచికాలు! నాకు వళ్ళు మండిందంటే నమ్మండీ. నోటిమీద వాతపెడదామనుకున్నా యిల్లాంటి కూత లెప్పుడూ కూయకుండా. దానమ్మకడుపు కాల, చిన్నా పెద్దా తారతమ్య ముండొద్దండీ మాట్లాడేటప్పుడు."

"ఏదో చిన్నమాటలు లెండి. అవన్నీ మనస్సులో పెట్టుకుంటే యెలాగండీ? కొత్తప్పుడు నాకోడలు గూడా యిదే ఫక్కీ. మెల్లి మెల్లిగా వాళ్ళకే తెలుస్తుంది పెద్దలవద్ద యెల్లా మాట్లాడాలో; సంసారాన్ని యెలా పొదుపుగావాడాలో."

"కనే కోడలుంటె వద్దనే అత్తవుంటుందండీ" ఆదంతా మీ పిచ్చిగాని. అది తెలివిగా సంసారాన్ని జరుపుతుంటె యేదో కృష్ణారామా అంటూ కూర్చొనేదాన్నేగా. వట్టి తెలివితక్కువ దద్దమ్మ, దుబారామనిషి, మొద్దురాచ్చిప్ప" నేనీ నడుమ మద్రాసు వెళ్లాలేండి. మాతమ్ముడు యెన్నిరోజులనుండో రమ్మనమని వుత్తరాలు వ్రాస్తున్నాడు. నాకు తీరికేదండి! అస్తమానము యింటిగొడవె! వెధవగొడవ. వెళ్లానేగాని యిల్లేమై పోతుందోనని వకటే భయం. నే ననుకున్నంతా జరిగింది. ఏం జెప్పనండి రామమ్మగారు? మనకరివేపాకు చెట్టుముప్పాతికవంతు ఆకు లేకుండా పోయింది. నా ప్రాణంతో సమానంగా పెంచానని మీకు గూడా తెలుసుగా? యేదో మీబోటి తెలిసినవారికి మినహా మరెవ్వరికీ పెట్టను, చెట్టు పాడైపోతుందని దాన్ని పిలిచి ఏమే కమలా చెట్టున ఆకే లేదేమె! అంటె, ఏమి సమాధాన మిచ్చిందో విన్నారూ? 'కరివేపాకు ఏమి భాగ్యము తే అత్తయ్యా అదే మరల ఆకువేస్తుంది. మరి వాళ్ళు అడిగినప్పుడు యెల్లా లేదనమంటారు?' ఆమెగారేమొ మహాదాత, నేనేమొ పిసనారినైనట్లు అందరు అనుకోరండి? అయినా వున్నదని అడిగినవారందరకూ పెట్టుకుంటూరా? ఇంక ఈ సంసారము ఏమి బాగుపడుతుందో మీరే చెప్పండి రామమ్మగారు.'

'మామ్మా అన్నంపెట్టవూ! అంటూ రామమ్మ మనుమరాలు వచ్చింది.'

'వస్తానండి సుబ్బమ్మగారు. అమ్మాయికి అన్నంపెట్టాలి. సంసారంలో ఇల్లాంటి గొడవలు వుంటూనే వుంటవి. అయినా మీబోటి పెద్దవారికి చెప్పాల్సిన పనేముంది లెండి.'

'లేపూ రామ్మా. యేదో మీబోటివారు రావటంవల్లనే కాస్తంత కాలక్షేపం జరుగుతుంది. అది మాట్లాడితే దాని నోటిముత్యాలేమన్నా రాలిపోతాయీ! పొద్దస్తమానం ఏవో పుస్తకాలు చదవటంతప్ప కాసేపైనా నాతో కులాసాగా మాట్లాడదండి. మరి అదేం పాపమో కాని. దానికి నేనేం అపకారం చేశానని. యేదో అనుకున్నప్పుడనుకున్నా తరువాత మాట్లాడగూడదు? వెళ్ళమ్మా వెళ్ళు. అమ్మాయికి యెంతగా ఆకలి వేస్తోందో? ఈ గొడవ యెప్పుడూ వున్నదేగా!' ★


## సి. కె. సెన్ అండ్ కంపెనీ లిమిటెడ్.

1878 నుంచి ఆయుర్వేద ఔషధములు, ఆసవములు, అరిష్టలు, తైలములు, ఘృతములు, దేశీయ ఔషధములు, షరబతులు మొదలైనవి తయారు చేయుచున్నవారు.

## మాలతీ రసాయన్

అతి మూత్రవ్యాధికి, ఇతర మూత్ర సంబంధ దోషములకు ప్రత్యేకౌషధము. మూత్రవిసర్జనమును చక్కపరచి చక్కెరను, ఆల్బ్యుమెన్‌ను చేరనివ్వదు.

## సంజీబన్ రసాయన్

నపుంసకత్వమును, నరముల బలహీనతకు ప్రత్యేకౌషధము. కృషింపును అరికట్టి అండక్షయమును నివారింప పటుతరముగ పనిచేయును. ఇవి రెండు లేక ఎక్కువ ఔషధములు చేరిన ప్రిస్క్రిప్షనుల రూపమున లభించును.

## జబాకుసుమ్ హౌస్
కలకత్తా 12.